క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ జలాలు, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితోఅభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువ ర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను విన్నవించుకోవాలన్నారు. 9959225673 నంబరుకు తమ సమస్యలను తెలపాలన్నారు.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని సీఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం ఆయన ఎస్ఐ విశ్వనాథ నాయుడుతో కలసి బుచ్చినాయుడుకండ్రిగ బీసీ బాలుర, ఎస్సీ బాలికలు, బాలుర హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి విద్యార్థికి పాఠశాల దశ చాలా కీలకమైనదని, ఉన్నత లక్ష్యాలను ఛేదించేందుకు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. సమాజంలో చదువే గౌరవాన్ని ఇస్తుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. పాఠశాల మైదానంలో ఎవరైనా మద్యం సేవిస్తే జైలు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: మండల పరిధిలో నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. సత్యవేడు చెందిన చంద్రకు రూ.1,95,999, శివకు రూ.53,333, ఈశ్వరయ్యకు రూ.51,512, నాగయ్యకు రూ.1,97,818 అందజేశారు. వరదయ్యపాళెం మండలంలో మారెయ్య రూ.లక్ష, అరుణకు రూ.2 లక్షలు, బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మురళీనాయుడుకు రూ.189523, కేవీబీపురంలో ఎన్.గౌతమికి రూ.83, 314 వంతున చెక్కులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏడీఓ సుబ్రమణ్యం, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వీకేఎన్ పరమశివం(బాషా), పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరదయ్యపాళెంకు చెందిన కల్లూరు పుష్పకు రూ.1,52,306, కె.మాధవ నాయుడుకు రూ.30 వేలు, ఎస్.అశోక్‌కు రూ.20 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

క్రీడా వసతుల కల్పనకు కృషి



క్రీడా పరికరాలు ఏర్పాటు చేసిన కెలాగ్స్ కంపెనీ ప్రతినిధులు

సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కల్పనకు శ్రీసిటీ ఫౌండేషన్, స్థానిక పరిశ్రమల సహకారంతో క్రీడా వసతులపై దృష్టి సారించింది. శ్రీసిటీలోని మాదనపాళెం, ఇరుగుళం జెడ్పీ హైస్కూళ్లు, రామచంద్రాపురం, గొల్లవారిపాళెం, వానెల్లూరు ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా వసతులను కెలాగ్స్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.8 లక్షలు విలువతో చిన్నపిల్లలు ఎంతో ఇష్టంగా ఆడుకునే ఊయల, జారుడుబండ, తిరుగుడుబల్ల, (మెర్రిగో) ఇతర ఆటవస్తువులు అమర్చారు. పిల్లలకు క్రీడా పరికరాలు వసతి కల్పించడం పట్ల ఆయా పాఠశాలల సిబ్బంది, స్కూల్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

బాసూ..కోర్టు కేసు

పారిశ్రామికవాడ శ్రీసిటీ కొలువు అయి ఉన్న వరదయ్యపాళెం మండలానికి కోర్టు కేసులు సైతం వెంటాడుతున్నాయి. దీంతో ఇక్కడ పని చేసే అధికారులు కార్యాలయంలో కంటే కోర్టుల చుట్టూనే ఎక్కువగా తిరుగుతున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్లు చేసిన అక్రమాలు.. ప్రస్తుత అధికారులను వెంటాడుతున్నాయి. దీంతో నిత్యం కోర్టుల్లో నమోదవుతున్న కేసులకు సమాధానం చెప్పేందుకు రిపోర్టులు తయారు చేయలేక రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయాన్ని వెంటాడుతున్న హైకోర్టు కేసులు
- భూ సమస్యలపై 150కి పైగా కేసులు
- రిపోర్టుల తయారీకి సతమతమవుతున్న రెవెన్యూ సిబ్బంది
- కోర్టు కేసులకు ప్రత్యేక తహసీల్దార్‌ను నియమించాలంటున్న ప్రజలు



వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్)తలుపులు మూసి ఉన్న తహసీల్దార్ కార్యాలయ గది

వరదయ్యపాళెం: మండలంలో రెవెన్యూ అధికారులు కార్యాలయ విధుల కంటే అధికంగా కోర్టుల్లో హాజరయ్యేందుకే అధిక సమయం వెచ్చిస్తున్నారు. భూసమస్యలపైనే కోర్టుల్లో కేసులు అధికంగా ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మండలంలో మొత్తం 29 పంచాయతీలు ఉండగా 45,586 వేల ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. ఇందులో ప్రధానంగా అపోలో టైర్ల పరిశ్రమ ఏర్పాటైన చిన్న పాండూరు, శ్రీసిటీ పరిధిలోని తొండూరు, శ్రీహరికోటకాలనీ, సిద్ధఅగ్రహారం, మోపూరుపల్లి గ్రామాలతో పాటు 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటైన రాచర్ల ప్రాంతంలో భూసమస్యలకు సంబంధించి 150కి పైగా కేసులు హైకోర్టులో నమోదైనట్లు మండల రెవెన్యూ కార్యాలయంలో ఉన్న వివరాల మేరకు సమాచారం.

కోర్టు కేసులకే పరిమితం..

గత మూడేళ్లుగా మండలానికి తహసీల్దార్‌గా వచ్చే ఏ అధికారి అయినా కోర్టు కేసులకే పరిమితమవుతున్నారు. వారంలో 3 రోజులకు పైగా విజయవాడలోని హైకోర్టుకు వ్యక్తిగతంగా హాజరవుతూ మండల ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రిపోర్టుల తయారీకి ఇబ్బందులు..

హైకోర్టులో విచారణకు వచ్చే కేసులకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి వివరాలను ఇచ్చేందుకు రిపోర్టులను తయారు చేసేందుకు తహసీల్దార్, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేసులకు బయట ప్రైవేటు వ్యక్తుల ద్వారా రిపోర్టులు సిద్ధం చేయించాల్సిన పరిస్థితి. వీటి తయారీకి కొంతమేరకు నగదు రూపంలో ఖర్చు చేయాల్సి ఉంది. వీటిని భరించలేక వారంలో 3 రోజులు విజయవాడ హైకోర్టుకు హాజరు కాలేక సతమతమవుతున్నారు. కొన్ని కేసులకు సంబంధించి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ వంటి జిల్లాస్థాయి అధికారులను సైతం పార్టీని చేస్తూ కేసులు వేస్తుండడంతో వారి హాజరు తప్పనిసరి అవుతోంది. ఇవన్నీ పరిష్కారం అయితే గానీ పూర్తి స్థాయిలో ప్రజలకు తహసీల్దార్ అందుబాటులోకి రావడం సాధ్యమవుతుందని తెలుస్తోంది.

పెండింగ్‌లో రెవెన్యూ సమస్యలు..

మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ గ్రామాలకు చెందిన 450 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. ఇందుకు సంబంధించి 15 ఎకరాల పట్టాభూమికి పరిహారం చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ ఇంటి పట్టాల పంపిణీ జరగలేదు. రోజువారీ వచ్చే రెవెన్యూ సమస్యలు సైతం క్షేత్రస్థాయిలో తహసీల్దార్ సందర్శన చేసి పరిష్కరించాల్సిన సమస్యలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మ్యుటేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతోంది.

వెంటాడుతున్న కేసులు..

చిన్న పాండూరు రెవెన్యూలో ఏర్పాటైన అపోలో టైర్ల పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. దీనికి కారణం 2012–14 కాలంలో పని చేసిన తహసీల్దార్, వీఆర్వోలే. అపోలో పరిశ్రమకు కేటాయించిన 384 ఎకరాల భూములకు సంబంధించి ఒకరికి కేటాయించిన భూమినే తిప్పితిప్పి ఇద్దరు, ముగ్గురికి పెద్దఎత్తున ముడుపులు అందుకుని అక్రమ పట్టాలను కట్టబెట్టారు. ఎక్కడెక్కడో ఉన్న వారికి ఈ పట్టాలను పప్పులు, బెల్లంలా పంపిణీ చేశారు. పరిశ్రమకు భూసేకరణ చేపట్టే సమయంలో ఈ అక్రమ పట్టాల గుట్టు బయటపడింది. అక్రమ పట్టాలు పొందిన వారి వద్ద డీ-పట్టాలు లేకపోవడంతో మొదటగా ఇచ్చిన వారికే పరిహారం ఇచ్చారు. దీంతో మిగిలిన అక్రమ పట్టాదారులు కోర్టులను ఆశ్రయించారు. ఒక్క చిన్నపాండూరు రెవెన్యూలోనే 120కి పైగా హైకోర్టులో కేసులు వేశారు.

కోర్టు కేసులు కాదని.. ఇన్‌చార్జ్‌గా కూడానా..!

వరదయ్యపాళెం తహసీల్దార్‌కు నెల రోజుల కిందట అధికారులు సత్యవేడు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. అక్కడ ప్రస్తుతం శ్రీసిటీ పారిశ్రామికవాడకు రెండో విడత భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇలాంటి కీలక సమయంలో నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడుకు రెగ్యులర్ తహసీల్దార్‌ను తొలగించి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించారు. అదే తహసీల్దార్‌కు రెగ్యులర్‌గా ఉన్న వరదయ్యపాళెం మండలంలో కోర్టు కేసులు వెంటాడుతున్నాయి. 150కి పైగా హైకోర్టులో కేసులు నడుస్తున్న నేపథ్యంలో అటు కోర్టుకు వచ్చే కేసులకు సమాధానం చెప్పేందుకు ఫైళ్లు సిద్ధం చేయాల్సి ఉండగా ఇటు సత్యవేడు మండల ఇన్‌చార్జ్ బాధ్యతల నేపథ్యంలో కీలక ఘట్టమైన శ్రీసిటీ రెండవ విడత భూసేకరణ ప్రక్రియకు అవసరమైన జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. రెండు మండలాల్లో కీలక పరిణామాలు ఉన్న పరిస్థితుల్లో ఏ విషయాన్ని నిర్లక్ష్యం చేయలేక పని ఒత్తిడితో తహసీల్దార్ దిక్కుతోచని స్థితిలో కొనసాగుతున్నారు.

వినతుల రోజున విధులకు గైర్హాజరు..

ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌డే రోజున తహసీల్దార్ గైర్హాజరయ్యారు. హైకోర్టులో కేసు ఉన్న కారణంగా ఆయన కోర్టుకు హాజరు కావాల్సి ఉండడంతో విధులకు హాజరు కాలేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

హామీలు మరిచి.. దారుణాలు చేస్తారా ?

- కూటమి ప్రభుత్వంపై సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఫైర్



మాట్లాడుతున్న రాజేష్

నారాయణవనం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుంచి రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన నారాయణవనంలో పార్టీ శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై రెడ్ బుక్ ప్రభుత్వం విరుచుకుపడుతోందని అన్నారు. దినపత్రిక క్లిప్పింగ్‌లను ఫార్వర్డ్ చేసిన వారిని కూడా వదలడం లేదని ఆరోపించారు. అధికార కూటమికి కొమ్ముకాస్తున్న ఎల్లో పేపర్ల క్లిప్పింగ్‌ను ఫార్వర్డ్ చేస్తే, కేసు నమోదు చేసి చంద్రగిరికి చెందిన యాక్టివిస్ట్ తేజను అరెస్ట్ చేశారని తెలిపారు. ఎమ్మెల్యేలు సాంస్కృతిక కార్యక్రమాల పేరిట పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని తాను ఎల్లవేళలా అండగా ఉంటానని సూచించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన ఏడాదికే 90 శాతం హామీలను నెరవేర్చి పేదల ఇళ్లలో ఆనందాన్ని నింపారని గుర్తు చేశారు. కానీ కూటమి నేతలు మాత్రం మహిళలు, యువతనే కాకుండా రైతులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని అన్నారు. జగనన్న ప్రతి పంటకు మద్దతు ధర ఇచ్చి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తే కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదని.. పంటలకు మద్దతు ధర కూడా ప్రకటించలేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి, మండల కన్వీనర్ సారకాయలు, రాష్ట్ర వాణిజ్య సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, నాగూ రు, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ పొన్నుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నేత తల్లికి నివాళి

నారాయణవనం: మండలంలోని వెంకటకృష్ణపాళ్యం పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మలింగం తల్లి చిన్నపాపమ్మకు సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ నివాళులు అర్పించారు. ఆదివారం మధ్యాహ్నం చిన్నపాపమ్మ(65) మృతి చెందారు. సమాచారం అందుకున్న రాజేష్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం ఉదయం గ్రామానికి చేరుకుని చేరుకుని పరామర్శించారు. చిన్నపాపమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ సారకాయలు, నాయకులు అన్నాదొరై, రాకేష్ కిరణ్, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనకు చర్యలు

సత్యవేడు: శ్మశాన ప్రాంగణాల్లో బోర్లు, షెడ్ల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానాలకు మెటల్ రోడ్డు వసతి కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో ఏడు మండలాలకు రూ.21 కోట్లు ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరు అయ్యాయని, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాలకు బాలికల ఉన్నత పాఠశాలలు మంజూరు అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ ఏడీ సుబ్రమణ్యం, డిప్యూటీ తహసీల్దారు త్యాగరాజ్, ఏఓ మురళి, హౌసింగ్ ఏఈ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

13వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు స్వాధీనంలో ఉన్న స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం పదమూడో రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఈ దీక్షకు సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాల కోసం స్వాధీనం చేసుకున్నామని, ఆ భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు లేక ఒకే ఇంటిలో మూడు కుటుంబాలు కలిసి ఉంటున్నారని తెలిపారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గోయల్‌బాబు, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓగా దీప బాధ్యతల స్వీకరణ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): సాధారణ బదిలీల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రేణిగుంట మండల ఏపీఓగా ఉన్న జ్యోతిశ్రీ తిరుపతి రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో వెంకటగిరి ఏపీఓగా ఉన్న దీప రేణిగుంటకు బదిలీపై వచ్చారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఉపాధి హామీ సిబ్బంది ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ఉపాధి కూలీలకు అందుబాటులో ఉంటూ రేణిగుంట మండలాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

జ్యోతి సేవలు ప్రశంసనీయం



జ్యోతిని సన్మానిస్తున్న సహచర సిబ్బంది



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలో ఏడేళ్ల పాటు పనిచేసిన ఏపీఓ జ్యోతిశ్రీ సేవలు ప్రశంసనీయమని రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గ్రామీణ ఉపాధిహామీ పథకం రేణిగుంట ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న జ్యోతిశ్రీ సోమవారం బదిలీపై వెళ్లారు. ఆమెను ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన అధికారులు సర్పంచులను, ఎంపీటీసీలను గౌరవించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తిరుమలరెడ్డి, సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, సూపరింటెండెంట్ పిచ్చిరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- **నారాయణవనం:** మండలంలో రెండు రోజుల పాటు విద్యుత్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మండలంలోని అరణ్యంకండ్రిగ గ్రామంలో, మధ్యాహ్నం 3 గంటలకు ఎరికంబట్టు సబ్‌స్టేషన్ల పరిధిలో సదస్సు ఉంటుందని చెప్పారు. అలాగే బుధవారం ఉదయం 11 గంటలకు సముదాయం సబ్‌స్టేషన్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సంబంధిత సమస్యలను విని యోగదారులు వినతిపత్రాల ద్వారా అందజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

6న సీతారాముల కల్యాణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నెహ్రూవీధిలో వెలసిన శ్రీపట్టాభిరామ మందిరంలో ఏప్రిల్ 6న శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

30న కవి సమ్మేళనం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 30వ తేదీ ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం జరుగుతుందని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆలయంలోని స్వామివారి ప్రధాన ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

రేపు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల్లోని కానుకలను కూడా దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఉదయం 7 గంటల నుంచి లెక్కించనున్నట్లు చెప్పారు. ఈ కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

జాతరలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: ప్రశాంత వాతావరణంలో నల్లగంగమ్మ జాతరను నిర్వహించుకోవాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నల్ల గంగమ్మ జాతర నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో జాతర నిర్వహించుకోవాలని, అదేవిధంగా జాతర నిర్వహణ కోసం ఎవరి దగ్గర బలవంతంగా డబ్బులు వసూలు చేయకూడదన్నారు. నల్ల గంగమ్మ జాతర సందర్భంగా ఎవరైనా సరే మద్యం తాగి అల్లర్లకు పాల్పడడం, రెచ్చగొట్టడం, ఈవ్ టీజింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందులో భాగంగా ఎనిమిది మంది వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నల్ల గంగమ్మ అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. సంప్రదాయ పద్ధతిలో జాతరను జరుపుకోవాలని కోరారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



శ్రీకాళహస్తిలో అవగాహన ర్యాలీ



సత్యవేడులో..

శ్రీకాళహస్తి: క్షయవ్యాధి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేద్దామని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ మధు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం పురస్కరించుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సిబ్బంది, జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, గల్ల పడడం, తరచూ జ్వరం రావడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు చేయించుకోవాలన్నారు. డాట్స్ పద్ధ తి ద్వారా మందులు అందజేసి నెలకు రూ.1000 రోగి ఖాతాలో జమ చేస్తారన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించండి

నారాయణవనం: క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుంటే ప్రాథమిక దశలోనే చికిత్స పొంది నయం చేసుకోవచ్చని ఎంఈఓ దర్శిత్‌రాజ్ అన్నారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు ఉచితంగా మందులు, చెప్పులు, దుస్తులు ప్రభుత్వం అందిస్తోందన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): క్షయ వ్యాధిని 2030 నాటికి పూర్తిగా అంతం చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఛత్రపకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం రేణిగుంటలో క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధికి బయట ఎక్కడా మందులు ఉండవని, ప్రభుత్వమే ఉచితంగా 6 నెలల పాటు మందులను సరఫరా చేస్తోందన్నారు.

సత్యవేడు: రెండు వారాలకు మించిన దగ్గు, క్షయ కావచ్చని డాక్టర్ సురేష్ తెలిపారు. సోమవారం సత్యవేడులో దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, కమ్యూనిటీ వైద్యశాల డాక్టర్లు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వరదయ్యపాళెం: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని చిన్నపాండూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లావణ్య సోమవారం చిన్నపాండూరు పురవీధుల్లో హాస్పిటల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.


రీసర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పార్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని చల్లమాంబపురం , తిమ్మభూపాలపురం గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. భూసమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. కార్యాలయం చుట్టూ పనుల కోసం ప్రజలు తిరగకుండా చూడాలని, గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. పెండింగ్ భూముల సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించండి



సంతవేలూరు సబ్‌స్టేషన్‌లో త్రీఫేజ్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న పుత్తూరు డీఈ, ఏడీఈ

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు సబ్‌స్టేషన్‌కు పూర్తిస్థాయిలో సిబ్బందిని భర్తీ చేయాలని స్థానిక రైతులు విన్నవించారు. సోమవారం సబ్‌స్టేషన్ ప్రాంగణంలో స్థానిక రైతులు, వినియోగదారులతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు డీఈ దేవఆశీర్వాదం, నాగలాపురం ఏడీఈ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సబ్‌స్టేషన్‌లో సిబ్బంది లేని కారణంగా కనీసం ఫ్యూజులు కాలిపోయినప్పుడు కూడా వేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. తక్షణమే సిబ్బందిని నియమింపజేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పలు విద్యుత్ సమస్యలపై విన్నవించారు. అనంతరం సంతవేలూరు ఫీడర్‌కు గత ప్రభుత్వ హయాంలో గృహ అవసరాలకు త్రీఫేజ్ కరెంటు సరఫరా కోసం పనులు ప్రారంభించగా ఆ ఫీడర్‌ను డీఈ, ఏడీఈలు లాంఛనంగా ప్రారంభించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని వారు ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ డీఈ బాలాజీ, ఏఈ విజయ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఎంఓ

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్థానికంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతల వివరాల నమోదును పరిశీలించారు. అలాగే వారికి అందజేసే పౌష్టికాహార వివరాలను, ఇతర పథకాల గురించి తెలుసుకున్నారు. ప్రధానంగా బాలింతలు, గర్భిణుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉదయ్ కుమార్, ద్వైత, జిల్లా గణాంకాధికారి నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.